## పక్కా గృహాలు నిర్మించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

**రాయచోటి టౌన్ :** కురబలకోట మండలం మాదిగ కుటుంబాలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదివేడు రెవెన్యూ గ్రామంలో మాదిగ కులాలకు చెందిన వారికి బ్రిటిష్ కాలం నుంచి భూములు ఉన్నాయని, ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. 35 ఏళ్ల కిందట అగ్నిప్రమాదం చోటు చేసుకుని పూర్తిగా ఇళు కాలిపోయాయని తెలిపారు. ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు భూమి పత్రాలు కూడా కాలిపోయాయని పేర్కొన్నారు. ఇదే అదునుగా భావించి హరి అనే వ్యక్తి రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి మాదిగ కుటుంబాలకు అన్యాయం చేస్తున్నాడని వాపోయారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి పాత రెవెన్యూ రికార్డులను పరిశీలించి వాటి ఆధారంగా పట్టాదారులకు పాసుపుస్తకాలు అందించాలని, రికార్డులను తారుమారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. బాధితులు పాల్గొన్నారు.

# టమోటా పంట ధ్వంసం

- వేర్లతో సహా పెకలించిన దుండగులు
- రూ.పది లక్షల వరకు నష్టం
- ఆదుకోవాలంటూ రైతు కుటుంబం ఆవేదన

టమోటా పంటను వేర్లతో సహా పెకలించిన దుండగులు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

రైతులు రోజంతా శ్రమించి వ్యవసాయం చేసి తాను పండించిన ధాన్యంతో పది మందికి కడుపు నింపుతూ బతుకుతున్నాడు. నిత్యం నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రైతుకు అనుకోకుండా టమోటా ధరలు పెరిగి రైతుల జీవితాల్లో ప్రస్తుతం వెలుగులు నింపుతున్నాయి. తమ జీవితాలు బాగుపడుతున్నాయని ఆశతో టమోటా రైతు ఆనందం వ్యక్తం చేస్తున్న తరుణంలో, వారి ఎదుగుదలను ఓర్వలేని కొంతమంది వ్యక్తులు వివిధ రకాలుగా టమోటా రైతుకు పంట నష్టం కలిగిస్తూ వస్తున్నారు. ఇలాంటి కోవకే చెందిన ఓ సంఘటన నిమ్మనపల్లి మండలం తవళం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... తవళం గ్రామం ఉంటావారిపల్లెకు చెందిన ఎ.గంగిరెడ్డి కుమారుడు ఎ.ముత్యాలు ఉంటావారిపల్లెలో వాలంటీర్‌గా పనిచేస్తున్నారు. తమ భూమిలోని సుమారు 30 కుంటల్లో తండ్రితో కలిసి ముత్యాలు సుమారు రూ.రెండు లక్షలు ఖర్చు చేసి టమోటా పంటను సాగు చేశారు. ఆదివారం మొదటి కోతలో 20 క్రేట్ల టమోటాలను కోసి మదనపల్లె మార్కెట్‌కు తరలించగా, అక్కడ ఒక్కొక్క క్రేటు రూ.4,400లకు విక్రయించినట్లు తెలిపారు. టమోటా కోత దశలో ఉందని, టమోటా ధరలు బాగున్నాయని ఆశాభావంతో కుటుంబం మొత్తం టమోటా పంటపై ప్రత్యేక శ్రద్ధను చూపినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో సైతం టమోటా పంట వద్ద కాపలా ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూడా సుమారు 11 గంటల సమయంలో పంటను పరిశీలించి ఇంటికి వెళ్ళామని పేర్కొన్నారు. సోమవారం ఉదయాన్నే టమోటా పంట వద్దకు రాగా గుర్తుతెలియని వ్యక్తులు తాము సాగు చేసిన 30 కుంటలలోని టమోటా చెట్ల మొదలను వేర్లకు పెరికివేసి పంటను ధ్వంసం చేసి ఉంచడాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఎన్నో ఆశలతో టమోటా పంటను సాగు చేశామని, ప్రస్తుతం మంచి ధరలు ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు పంటను ధ్వంసం చేసి సుమారు పది లక్షల వరకు తీవ్ర నష్టం కలిగించారని ఆవేదన చెందారు. రైతు కుటుంబం పడిన శ్రమను దుండగులు నాశనం చేశారని శోకసముద్రంలో మొనగారు. జరిగిన సంఘటనపై స్థానిక ఎస్ఐ రామకృష్ణ, వ్యవసాయ అధికారిని లక్ష్మీ ప్రసన్న, ఉద్యానవన శాఖ అధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దుండగులను గుర్తించి తమకు న్యాయం చేయాలని, తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పంటను చూపుతున్న రైతు కుటుంబ సభ్యులు

# బిజెపిని సమాధి చేద్దాం

- వైసిపి, టిడిపి, జనసేనలను నిలదీద్దాం
- కడప ఉక్కు కోసం కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

కడప ఉక్కు పరిశ్రమ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ కార్యాలయం గేటు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన ఆద్యంతం బిజెపి విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతాల్లో సున్నపురాయి మొదలు విలువైన ఇనుము, అత్యంత విలువైన డోలమైట్, బంగారం, వజ్రాలు లాంటి 64 రకాల ఖనిజల నిక్షేపాలు ఉన్నాయని చెప్పారు. వీటి ఆధారంగా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కలిపించి, కరువు నుంచి శాశ్వత విముక్తి చేయాలనేది ప్రజల కోరిక అని వివరించారు. అప్పట్లో రాజశేఖరరెడ్డి నుంచి నేటి జగన్ మోహన్ రెడ్డి వరకు నాలుగు సార్లు శంకుస్థాపన చేసిన కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభం కాకపోవడం దుర్మార్గమన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలు పరుస్తామని బిజెపి హామీ ఇచ్చిందని చెప్పారు. విభజన చట్టం రూపొందించి పది సంవత్సరాలు పూర్తయింది కాని ఒక్క హామీ పూర్తిగా అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర బిజెపి పార్టీ తరుపున కర్నూలులో రాయలసీమ డిక్లరేషన్, కడపలో రాయలసీమ రణభేరి అంటూ సభలు నిర్వహించి మాటల గారడి చేసిందని ఆరోపించారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) అధ్యయనం చేసి నివేదిక ఇవ్వడంతోనే కడప ఉక్కు పరిశ్రమ స్థాపించడం సాధ్యం కాదని బిజెపి ప్రభుత్వం నిసిగ్గుగా ప్రకటించిందని వాపోయారు. ప్రభుత్వ రంగంలో లాభదాయకం కాని ఉక్కు పరిశ్రమ, ప్రయివేట్ జిందాల్ కంపెనీకి ఎలా లాభదాయకం అవుతుందో బిజెపి వారికే తెలియాలని ఎద్దేవా చేశారు. సెయిల్ అధ్యయనం చాటున తన చేతికి రక్తపు మరకలు అంటకుండా కడపఉక్కును, రాయలసీమ యువత ఆశలను బిజెపి హత్య చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారానికి పోటీ పడుతున్న వైసిపి, టిడిపి పార్టీలు ఉక్కు పరిశ్రమను సాధించడంలో ఘోరంగా విఫలమయ్యాయని చెప్పారు. తమ పార్టీకి 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచుతానన్నా జగన్ మోహన్ రెడ్డి కేంద్రం ముందు నడుములు వంచి సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నాడని విమర్శించారు. కొత్త రాజకీయాలు అంటూ రంకెలు వేస్తున్న జనసేన నేత ఏకంగా రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపి భజనలో తరిస్తున్నాడు తెలిపారు. విభజన చట్టంలో భాగంగా ఉన్న కడప ఉక్కు సాధించడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని అందుకు అధికార వైసీపి చొరవ చూపాలని రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు, ప్రజాతంత్రవాదులు, యువత పెద్ద సంఖ్యలో సమీకరించి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రవి కుమార్, వెంకట్రామయ్య, ప్రభాకర్ రెడ్డి, నరసింహ, బసిరెడ్డి, జయరామయ్య, వెంకటేష్, సురేంద్ర, ఫయాజ్, మెహరాజ్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

కలెక్టర్ గిరీషకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

# విఒఎల సమస్యలు పరిష్కరించాలి

**- సంఘం రాష్ట్ర కార్యదర్శి పరంజ్యోతి**

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

విఒఎల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పరంజ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలంటూ పట్టణంలోని మిషన్ కాంపౌండులో విఒఎలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పరంజ్యోతి, ఉపాధ్యక్షులు కృష్ణమ్మలు మాట్లాడుతూ విఒఎలు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ 64ను రద్దు చేయాలన్నారు. ప్రజా సంకల్పయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విఒఎల అండగా ఉంటామని చెప్పి, ప్రస్తుతం వారిని ఇబ్బంది పెట్టే నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాల వల్ల 2000 సంవత్సరం నుండి సెర్ప్ ద్వారా పనిచేస్తున్న 38 వేల మంది వీధిన పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. యాపులు భారాన్ని తగ్గించాలని, 5జి కనెక్టివిటీ సిమ్ములు, ట్యాబులు ఇవ్వాలన్నారు. సిసి, ఎసిల ఒత్తిళ్ల తగ్గించాలని, లక్ష్యాలను నిర్దేశించి వేధించడం సమంజసం కాదన్నారు. సిబిజిహెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. విఒఎల మెర్జ్ ఆపాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, లోకో యాప్ వర్క్ కోసం 5జి మొబైల్ ఫోన్లు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విఒఎలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డెప్ప రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాణి, జిల్లా కోశాధికారి సుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యక్షులు శ్వేత, కార్యదర్శి దివ్య జ్యోతి, కోశాధికారి సుమతి, విఒఎలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** విఒఎల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వెలుగు విఒఎల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమ్మ, కార్యదర్శి రెడ్డప్ప, కోశాధికారి పరంజ్యోతి, జిల్లా అధ్యక్షులు రాణి ఆధ్వర్యంలో జీపు జాతా కార్యక్రమాన్ని సోమవారం నిమ్మనపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా మహిళా సంఘాలలో విఒఎలుగా పనిచేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సుబ్రహ్మణ్యం, విఒఎలు రాధా, నరేంద్ర, రెడ్డి ప్రసాద్, రెడ్డప్ప, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

మదనపల్లె : నిరసన తెలుపుతున్న విఒఎలు

# బాధితులను భయపెడుతున్న పోలీసులు

**- సివిల్ రైట్స్ డే సమావేశంలో దళిత నాయకుల ఫిర్యాదు**

**ప్రజాశక్తి-పీలేరు**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టే దళితులపై పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేస్తూ బాధితులను భయాందోళనలకు గురిచేస్తున్నారని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పీలేరు మండలం, బోడుమల్లువారిపల్లి పంచాయతీ, హరిజనవాడలో సోమవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దళిత సంఘాల నాయకులు ఎన్.సుధాకర్ బాబు, టిఎల్ వెంకటేష్, నగరిమాడుగు సుభాష్, ధరణ్ కుమార్, భానుప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అమలు చేయాల్సినవారే నీరుగారుస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఇసుక, మట్టి అక్రమ రవాణాలపై ప్రశ్నించిన వారిపై అగ్రకులాల వారు బహిరంగంగా మారణాయుధాలతో దాడికి యత్నించిన సంఘటన పీలేరు మండలంలో చోటు చేసుకుందన్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరి వెళ్లిన బాధితులపై కౌంటర్ కేసులు బనాయించడమే అందుకు ఓ నిదర్శనమని చెప్పారు. ఈ విషయంలో రక్షణ కల్పించాల్సిన వారే చట్టాన్ని ఉన్నవారికి చుట్టాన్ని చేసిన తీరుపై వారు అసంతృప్తిని వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సర్టిఫికెట్ల మంజూరులోనూ సీనియర్ విఆర్వోలు అర్జీదారుల నుంచి మామూళ్లు తీసుకుంటూ ఇతరుల ఖాతాలోకి తీసుకుని వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కచ్చితంగా కల్పించాల్సి ఉందని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న మరుగుదొడ్లకు తాళాలు వేసి పెట్టడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దళితవాడలకు శ్మశానవాటికలు కేటాయించి, భౌతికంగా రక్షణ కల్పించాలని కోరారు. దళితులకు ఉపాధి హామీ పనులు కల్పించడంలో ఉపాధి హామీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, గుట్టుచప్పుడు కాకుండా బడా నాయకులకే పనులను అప్పగించి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు చెప్పారు. స్పందించిన తహశీల్దార్ ధనంజయులు, ఎంపిడిఒ మురళీమోహన్ రెడ్డి, హౌసింగ్ ఎఇ బాలాజీ ఆ సమస్యల పరిష్కరించడంలో తాము ప్రత్యేక చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. అధికారులందరూ మండల స్థాయిలో జరిగే ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ సమావేశానికి గత సమావేశంలో ఎదురైన సమస్యలపై ఏమేరకు పరిష్కారం జరిగింది, జరగని వాటికి తగిన కారణాలను, ఆధారాలతో సహా తీసుకుని హాజరు అవ్వాలని సూచించారు. సివిల్ రైట్స్ డే సమావేశానికి ప్రభుత్వ అధికారులందరూ ఖచ్చితంగా సకాలంలో హాజరవ్వాలని, ఆలస్యంగా వచ్చే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తహశీల్దార్ హెచ్చరించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ ధనుంజయులు

డిఆర్ఒ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

## మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనమివ్వాలి

**- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు**

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు ఏజెన్సీలకు కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరిగిన ధరలతో ఏజెన్సీల వారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని టమోటా రూ.200 పైచిలుకు ఉంటే, కూరలు చేయాలన్నా ఇబ్బందుల నేపథ్యంలో ప్రతి విద్యార్థికి మెనూ ఛార్జీలు 8. రూ నుంచి రూ. 20 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో విద్యా సంస్థలు మెర్జ్ చేయడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని వారికి ఉపాధి చూపించే భాధ్యత ప్రభుత్వానిదేన్నారు. వంట పాత్రలు గ్యాస్ సరపరా ప్రభుత్వమే సరఫరా చేసి గుర్తింపుకార్డులివ్వాలన్నారు. మూడు నుంచి నాలుగు నెలల పెండింగ్ బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు మీసాల జయన్న, భాగ్యమ్మ నాగమణెమ్మ, మనీషా, కవిత, సరిత, మమత, హరిత, పద్మజ, వనజ, జలజ పాల్గొన్నారు.

## శాస్త్రీయ సమాజ నిర్మాణమే జెవివి లక్ష్యం

**ప్రజాశక్తి - రాయచోటి**

సమాజంలో మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావనలు ప్రబలంగా ఉన్నాయని, వాటిని తొలగంచడానికి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో విజ్ఞాన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హేతుబద్ధంగా ఆలోచించినప్పుడే శాస్త్రీయ దృక్పథం అలవడుతుందని తెలిపారు. రాయచోటి మండల కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ జెవివి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరమూ చెకుముకి పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. డైట్ అధ్యాపకులు వై.సి.రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలు కృత్రిమ మేధా, 5 జీ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మొదలైన శాస్త్ర సాంకేతిక రంగాలలో దూసుకుపోతున్నాయన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక చోటి రాయచోటి పట్టణ కమిటీ సభ్యులు ఆంజనేయులు, బయారెడ్డి, అశోక్ రెడ్డి, మల్‌రెడ్డి, రామయ్య ప్రతాపరెడ్డి, బాబా ఫక్రుద్దీన్, రవీంద్రనాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శివారెడ్డి, మధుసూదన రాజు పాల్గొన్నారు.

## అర్జీలకు సత్వర న్యాయం : కలెక్టర్

**ప్రజాశక్తి - రాయచోటి**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను నాణ్యతతో రీఓపెన్ కాకుండా పరిష్కరించాలని కలెక్టర్ గిరీష పి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జెసి ఫర్మాన్ అహ్మద్, డిఆర్ఒ సత్యనారాయణప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందిన అర్జీలకు ప్రజలు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ అర్జీలనుసత్వరం పరిష్కరిం చాలన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో అందిన సర్వీస్ రిక్వెస్ట్‌లకు టోకెన్ జనరేట్ చేసి ఇంకనూ పరిష్కరించని వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఆయా ఎంపిడిఒలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

మణిపూర్ ఘటన నేరస్థులను కఠినంగా శిక్షించి శాంతిని నెలకోల్పాలని ఎపి దళిత మిత్ర సంఘం డిమాండ్ చేశారు. సోమవారం అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద అధ్యక్షులు కైపు రామాంజనేయులు సమాఖ్య రాష్ట్ర నాయకులు ఎల్లయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలుగా దాచిపెట్టిన హింస ఒక్కసారిగా బట్టబయలు అయిందని పేర్కొన్నారు. బిజెపి అల్లర్లు సృష్టిస్తే దాన్ని బయటకు రాకుండా కేంద్ర ప్రభుత్వం దాచి పెట్టిందని అన్నారు. ఆ రాష్ట్రంలో మహిళలకే భద్రతా లేకుండా పోవడం బిజెపి వారంతా సిగ్గుపడాలన్నారు. దేశంలో ఆడవారికి భద్రత లేకుంటే దేశాన్ని ఏమాత్రం రక్షిస్తారని ప్రశ్నించారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ దళిత మిత్ర రాష్ట్ర అధికార ప్రతినిధి నాగభూషణం, రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి నాగేశ్వర జిల్లా అధ్యక్షులు కిషోర్ బాబు, ఉపాధ్యక్షులు శంకరయ్య, ఆంజనేయులు, మండల అధ్యక్షులు రెడ్డిప్రసాద్, ఏపీ దళిత వేదిక సామాఖ్య కార్యదర్శి, అసెంబ్లీ ఇన్‌ఛార్జి నాగార్జున, దర్బార్, భాస్కర్, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దళితమిత్ర సంఘం నాయకులు

## ఉర్దూ సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి

**- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్**

**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

విద్యార్థి దశ నుంచే ఉర్దూ సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. ప్రసిద్ధ అంతర్జాతీయ ఉర్దూ కవి, రచయిత మహమూద్ షాహిద్ సారథ్యంలో ప్రారంభించిన 'అఫ్సానా నుమా' ఉర్దూ కథానిక తొలి ద్వైమాసిక పత్రికను సోమవారం స్థానిక జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలీమ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మాతృభాషపై పట్టు సాధించేందుకు కథలు, సాహితీ పుస్తకాలను విద్యార్థులు చదవాలని, దీనివలన ఇతర పాఠ్యాంశాలను సులభతరంగా అవగాహన చేసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఉర్దూ భాష అభివృద్ధికి రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉర్దూను ద్వితీయ అధికార భాషగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉర్దూ మాధ్యమంలో అభ్యసించే విద్యార్థులకు కూడా మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ప్రపంచంలోని పలు దేశాల్లో ఉర్దూ అధికార భాషగా ఉందని పేర్కొన్నారు. 'అఫ్సానా నుమా' ఉర్దూ కథానిక పత్రిక సంపాదకులైన ప్రసిద్ధ కవి మహమూద్ షాహిద్ ఉర్దూ భాషాభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్నారని, 'వసీలా' ఉర్దూ టివి న్యూస్ ఛానల్‌ను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విదేశాల్లో జరిగిన పలు ఉర్దూ సాహితీ కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొని ప్రశంసలందుకున్నట్లు వివరించారు. ఉర్దూ భాషాభిమానులు ఉర్దూ పత్రికలు, పుస్తకాలను పాఠశాలల్లో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అలీ ఖాన్, కరీముల్లా, గుల్జార్ అహ్మద్, రోషన్ జమీర్, శంకరప్ప విద్యార్థులు పాల్గొన్నారు.

## నేతాజీ విగ్రహానికి విద్యుత్ ఉద్యోగుల వినతి

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

విద్యుత్ ఉద్యోగులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి జెఎసి ఆధ్వర్యంలో పట్టణంలోని నేతాజీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అధ్యక్ష, కార్యదర్శులు బాలు నాయక్, నాగరాజు విద్యుత్ ఉద్యోగులతో కలిసి చిత్తూరు రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం నుంచి బంగ్లా సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్ టు జిపిఎఫ్, పే రివిజన్, కాంట్రాక్ట్ కార్మికులు, గ్రేడ్-2 జెఎల్ఎం, అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీ, చనిపోయిన గ్రేడ్ -2 జెఎల్ఎం కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు, విద్యుత్ యూనియన్ నాయకులు, ఎఇలు, జూనియర్ ఇంజినీర్లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## ప్రభుత్వ విధానాలతో విద్యారంగం నిర్వీర్యం

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ**

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నీరుగారుస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తూ విద్యా వ్యవస్థను సర్వనాశనం చేస్తోందని మండి పడ్డారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందని ద్రాక్షలా మారిందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఇవ్వాలని, బస్ పాసులు ఇంటర్ విద్యార్థులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి విద్యార్థికీ అమ్మఒడి పథకాన్ని వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు అల్తాఫ్, ఇస్మాయిల్, చిన్నారెడ్డి, కిరణ్, హరి, చరణ్, నసర్, చైతన్య, సాయి పాల్గొన్నారు.

## స్కిప్పింగ్ పోటీల్లో జ్ఞానాంబిక విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

స్థానిక శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు కర్నూల్‌లో జూలై 29, 30వ తేదీలలో నిర్వహించిన స్కిప్పింగ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురు ప్రసాద్ తెలిపారు. ఈ పోటీలలో కళాశాల విద్యార్థినులు వి.పద్మశ్రీ ఫ్రీ స్టయిల్, స్పీడ్ డబుల్ అండర్ రిలేలో రెండు బంగారు పతకాలు, జి.మానస ఒక బంగారు పతకం, ఒక వెండి పతకం, ఆర్.భార్గవి ఒక బంగారు పతకం, ఒక రజిత పతకం, ఎ.సుప్రజ ఒక బంగారు పతకం, జి.త్రిష రజిత పతకం సాదించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర, పీడీశరత్ నాయక్‌అభినందించారు.

ఇ-పంట నమోదు పై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ నరసింహకుమార్

## ఇ-పంట నమోదుపై శిక్షణ

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల కేంద్రమైన తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నరసింహకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఇ-పంట నమోదుపై విఆర్‌లు, రైతు భరోసా కేంద్రం అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు ఇ-పంటలో నమోదయ్యేలా చూడాలని రైతు భరోసా కేంద్రం అధికారులను ఆదేశించారు. ఎక్కడ చిన్నచిన్న లోపాలకు తావు లేకుండా పంట నమోదు జరగాలని తెలిపారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనాల నాణ్యత పై రాజీ పడబోమని, ప్రస్తుత సీజన్‌లో ఎరువుల కొరత ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా చూడాలని ఆర్‌బికె అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఇ-పంట అప్లికేషన్ జియోకో ఆర్డినేట్ తో లింక్ అయి ఉండని పంటవేసిన సర్వేనెంబర్ భూమి వద్దకు వెళ్లినప్పుడు మాత్రమే పంట నమోదును ఆన్‌లైన్‌లో పొందు పరచాలని వ్యవసాయశాఖ అధికారి కృష్ణ చైతన్య తెలిపారు. కార్య క్రమంలో ఎఒ కృష్ణ చైతన్య, ఉద్యానశాఖ అధికారి భాస్కర్, డిప్యూటీ తాసిల్దార్, ఆర్ఐ నవీన్, రెవిన్యూ సిబ్బంది, ఆర్బికె సిబ్బంది పాల్గొన్నారు.

## అందరికీ ఆదర్శప్రాయుడు ప్రేమ్‌చంద్

**ప్రజాశక్తి-రాజంపేట టౌన్**

మండల పరిధిలోని ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మండల వనరుల కేంద్రంలో ప్రేమ్‌చంద్ 143వ జయంతి వేడుకలను సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్రాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా ప్రేమ్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ రఘునాథరాజు మాట్లాడుతూ ప్రేమ్‌చంద్ బ్రిటిష్ ఇండియా కాలంలో ప్రజలలో దేశభక్తిని పెంపొందించే అనేక రచనలు చేశారని తెలిపారు. అదేవిధంగా సమాజంలోని రుగ్మతలను పారద్రోలడానికి కూడా కృషి చేశారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి అందరికి ఆదర్శప్రాయుడని తెలిపారు. ఎఇఒ-2 నాగ తిరుమలరావు మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కడ ఏ పోటీలు జరిగినా అందులో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని చెప్పారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొన్నప్పుడే భయం అనేది లేకుండా పోతుందన్నారు. ప్రేమ్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించినటువంటి వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందించారు. ప్రథమ బహుమతి సుప్రియ, ద్వితీయ బహుమతి జాహ్నవి, తృతీయ బహుమతి చాందినీలు గెలుపొందడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు చాంద్‌బాషా, వెంకటలక్ష్మి, నిర్మల, ప్రసన్న, గంగాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాపునాడు అధ్యక్షులుగా శశిభూషణ్

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

శశిభూషణ్

తంబళ్లపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కాపునాడు అధ్యక్షులుగా బి.కొత్తకోట పట్టణానికి చెందిన దేసూరి శశిభూషణ్ నియమితులయ్యారు. ఎపి కాపునాడు కార్యవర్గం ఆదేశానుసారం రాజంపేట పార్లమెంటు నియోజ కవర్గం పరిధిలోని రాయలసీమ కాపునాడు జోన్ అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, సలహా మేరకు జాతీయ కాపు నాడు అధ్యక్షుడు గాళ్ళ సుబ్రమణ్యం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించినందుకు కాపునాడు రాష్ట్ర అధినాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల సమస్యలపై నిర్విరామ పోరాటం చేసి, వారికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. త్వరలో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి బలిజకుల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చొరవ చూపుతానని వెల్లడించారు. కాపునాడు నియోజకవర్గ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన దేసూరి శశిభూషణ్‌కు కాపు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి-నందలూరు**

మండలంలో విద్యుత్ మరమ్మతుల పనుల కారణంగా మంగళ వారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇఇ మురళీధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట 132 కెవి మరమ్మతులు నిర్వహిస్తుండడంతో చింతకాయలపల్లి, పాటూరు, నందలూరు, నల్లతిమ్మయ్యగారిపల్లి, చెన్నయ్య గారిపల్లి, సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు నిర్వహించడంతో పాటు విద్యుత్ తీగలకు పై ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. వినియోగ దారులు విద్యుత్ సంస్థకు సహకరించాలని కోరారు.

## పుల్లంపేట వాసికి గణితంలో డాక్టరేట్

**ప్రజాశక్తి-పుల్లంపేట**

డాక్టరేట్ పొందిన జి.శివయ్య

పుల్లంపేటకు చెందిన గుంటి శివయ్య కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్ర విభాగంలో డాక్టరేట్ పొందారు. 'యుంహెచ్‌డి కన్వెక్టివ్ ఫ్లో ఆఫ్ హీట్ అబ్జర్వింగ్ అఫ్ జనరేషన్ అండ్ రేడియేటింగ్ ఫ్లూయిడ్ త్రూ ఎ పోరస్ మీడియం' అనే అంశం పైన పరిశోధన చేసినట్లు శివయ్య తెలిపారు. ఆ సెల్ యూనివర్సిటీ గణిత శాస్త్ర పరిశోధన సూపర్వైజర్ కె.జయరామిరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు.

## సమయపాలన పాటించని ఎపిజిబి ఉద్యోగులు

### అవస్థలు పడిన ఖాతాదారులు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

పట్టణ స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు సేవలందించాల్సిన సత్యంకల్యాంలో వెలుగొందుతున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల నిర్లక్ష్యం వలన అభాసుపాలవుతోంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల గ్రామీణ బ్యాంకు బ్రాంచ్‌లో సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు భోజన విరామానికి వెళ్లిన బ్యాంకు ఉద్యోగులు 3:15 గంటలైనప్పటికీ విధులలోకి రాకపోవడంతో వినియోగదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. డ్వాక్రా మహిళలతో పాటు ఇతర సేవల పొందే వినియోగదారులతో సహాయంగా ఉన్నారేని గ్రామీణ బ్యాంకు వినియోగదారులలో ప్రతిరోజు కిక్కిరిసిపోతూ ఉంటుంది. శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడం తో సోమవారం రద్దీ మరింత ఎక్కువయ్యారు. ఉద్యోగులు అందు బాటులో లేకపోవడం చేత మహిళా వినియో గదారులు తీవ్ర అసహనానికి గురయ్యా రు. మేనేజరు మారిన ప్పటినుండి బ్యాంకులో పద్ధతులు, సేవలలో మార్పులు లేవని ప్రజలు చర్చిం చుకుంటున్నారు. బ్యాం కు సిబ్బంది నిర్లక్ష్యం పట్ల ఖాతాదారులు అసహ నం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఎపి జిబి శాఖ వారు తీరు మార్చు కుంటుందేమో వేచి చూడాల్సిందే.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE VENKATAGIRI
O.S.NO. 85 OF 2022
Devalla Krishna Murthy ......Plaintiff
VS
Thambichetty Ramaiah ......Defendant
NOTICES TO DEFENDANT BY WAY OF SUBSTITUTE SERVICE
1. Thambichetty Ramaiah, S/o Venkataswamy, ASI, Prohibition & Excise Police station, Piler, Residing at D.No. 1-426/3, Synaik Nagar, Piler, Annamayya District - 517214.
Take notice that the petitioner has filed the above Suit. Plaintiff filed the above suit against Defendant for recovery of amount. Which stands posted to above matter on 12-10-2023 for your appearance. Hence you are here by required to appear before the above named court on the aforesaid date at 10.30 a.m, onwards either in person or through an advocate and file your objections else the matter will be decided as exparte.
Hg Date; 12.10.2023
V. CHENCHU KRISHNAIAH, B.Sc., L.L.B, ADVOCATE, VENKATAGIRI, CONTACT NO: 9985398129.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : 'కొరముట్ల'

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని స్థానిక ప్రజా పరిషత్ సభ భవనంలో సోమవారం ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలంటే అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసినప్పుడే మండల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రైతుల కోసం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పిల్లలకి సరైన భోజనం అందించాలని అంగన్వాడీ సిబ్బందికి తెలిపారు. జగనన్న కాలనీలో నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు తెలిపారు. మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. రైతులకు ట్రాన్స్‌పార్మర్లు అందించడంలో పుల్లంపేట విద్యుత్ అధికారులు వరుసలో ఉన్నారని తెలిపారు. మండలంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకుని వస్తే జిల్లా అధికారులతో మాట్లాడి సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలో రెవెన్యూ సమస్యలను సకాలంలో స్పందించి సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ నరసింహాకుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో మాల వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్, మండల వైస్ ఎంపిపి జయశంకర్ నాయుడు, ఎంపిడిఒ రఘురాం, ఇఒపిఆర్‌డి ప్రకాశం, తహశీల్దార్ నరసింహకుమార్, విద్యాధికారులు రఘునాథంరాజు, నాగ తిరుమల రావు, వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య, పశుసంవర్ధక శాఖ అధికారి సుధీష్, మండల వైద్యాధికారి డాక్టర్ మనోజ్ డాక్టర్ సానే శేఖర్, ఎపిఒ, ఎపిఎం సుబ్బలక్ష్మమ్మ, సచివాలయ సిబ్బంది ,పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అగ్రికల్చర్ సిబ్బంది పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఎస్సై రఘురాం, పోలీస్ సిబ్బంది అటవీ శాఖ సిబ్బంది, హౌసింగ్ ఇరిగేషన్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు, అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

# ముస్లిం మైనార్టీల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యం

### రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్ తాజ్

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

ముస్లిం మైనార్టీల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్ తాజ్ స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి అంతపురం పార్లమెంటు కార్యాలయంలో ఘర్‌ఘర్ నారా - చంద్ర బాబు హమారా ముస్లిం మైనారిటీల కోసం నూరు బాషా సోదరులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టిడిపి కార్యని ర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్ తాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు ఒరిగిందేమీ లేదని రాజకీయంగా లబ్ధి పొందడం కోసం ఇచ్చిన ఎమ్మెల్యే పదవులు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ సలహాదారులుగా ఇచ్చిన రెండు పదవుల ద్వారా ముస్లిం సమాజానికి ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. వారికి ఇచ్చిన పదవులకు నిధులు, విధులు లేనివి కేవలం అలంకారప్రాయంగా మారిపోయాయని విమర్శించారు. ప్రభుత్వ సలహాదారులుగా ఉన్న వారికి ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అపాయింట్మెంట్ కూడా దొరకని దుస్థితిలో ఉన్నా రని ఆమె ఎద్దేవా చేశారు. పూర్తిస్థాయిలో ముస్లిం మైనారిటీలను ఆర్థికంగా, విద్యాపరంగా, ఉద్యోగ పరంగా అణచివేతకు గురి చేశారన్నారు. గత టిడిపి హయంలో అన్నిరంగాలలో ముస్లిం మైనార్టీలు రాణించారని తెలిపారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

# శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించండి

**ప్రజాశక్తి-కలికిరి**

శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలంటూ తహశీల్దార్ భాగ్యలతకు కలికిరి మాదిగపల్లి గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా గ్రామం సమీపంలో ఉండే ప్రభుత్వ భూమితో పాటు, అప్పటి పెద్దలు దారాదత్తం చేసిన కొంత భూమి కలుపుకొని శ్మశాన వాటిక ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఇప్పుడు భూమి విలువ పెరిగిందని వారి వారసులు తిరిగి మా భూమి ఇవ్వమని ఇబ్బందులకు గురి చేస్తు న్నారని, ఈ విషయంపై పలుమార్లు ఎస్‌సి,ఎస్‌టి మానిటరింగ్ సమావేశంలో విన్నవించుకున్నా ఇప్పటివరకు సమస్యకు పరిష్కారం దొరకలేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి మాకు శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఎస్‌టి మండల నాయకులు శ్రీనివాస్‌వర్మ, రాంబాబు, అంబేద్కర్ నేషనల్‌పార్టీ నాయకులు యేసురాజు పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న మాదిగపల్లి గ్రామస్తులు

ఉపాధ్యాయురాలు అన్సారీతో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

## అన్సారీ సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి-పీలేరు**

మండలంలోని ఎనుములవారిపల్లె జడ్‌పి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న అన్సారీ సేవలు అపూర్వమైనవని పాఠశాల ప్రధానో పాయుడు బి. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయిని స్వచ్ఛంద పదవీవిరమణ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణంలో హెచ్‌ఎం అధ్యక్షతన వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయినిగా ఆమె సేవలు పాఠశాలకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయని కొనియాడారు. తనకు ఇంకా ఎంతో సర్వీసు ఉన్న కూడా ముందే పదవీ విరమణ స్వీకరిస్తున్నారని అన్నారు. అన్సారీ మాట్లాడుతూ ఈ పాఠశాలలో పనిచేస్తున్నంత కాలం తాను ఎంతో ఆనందం పొందానని, స్వచ్ఛంద పదవీ విరమణ స్వీకరించడం ఒక రకంగా బాధగా ఉన్నా, మరో రకంగా సంతోషంగా ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాప్యాయులు జె.సూర్యప్రకాష్, యం. రెడ్డిప్పరెడ్డి, వి.శ్రీధర్ బాబు, ఎన్.మస్తాన్ సాహెబ్, కె. రమేష్, అమర్నాథ్‌రెడ్డి, వి. వెంకటరమణ, ఎస్. నస్రత్ బేగం, వై.మునిరాజ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న రాజగోపాల్

## విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ, రెడ్డివారిపల్లి ఎంపిపి పాఠశాలలో రిటైర్డ్ హెచ్‌ఎమ్ జివి.ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టి.రాజగోపాల్ హాజరై విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన ఉంటుందని, బాగా చదివి అనుకున్న లక్ష్యాలను అధిరో హించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు దివ్యభారతి బుక్‌సెంటర్ అధినేత ప్రసాద్‌రెడ్డి ఉచితంగా విద్యాసామాగ్రి అందించారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనుంజయరెడ్డి, విష్ణ వర్ధన్‌రెడ్డి, ఉపాద్యాయులు చౌడప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లయ్య కొండపై భక్తుల సందడి

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండల సమీపంలోని మల్లయ్యకొండలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. పూజారి ఈశ్వరప్ప , మల్లికార్జున స్వామీలు ఎమ్మెల్యే సతీమణిని ఘనంగా స్వాగతించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయానికి సమీపంలోని గౌరమ్మ గుడిలో సోమవారం మహిళలు పెద్ద ఎత్తున సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి సన్నిధిలో సాష్టాంగ నమస్కారంతో వరపడ్డారు. గౌరీమాత ఆలయం అర్చకులు శేఖర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, సహస్రనామార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, మహిళలు ఆలపించిన శివనామస్మరణ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలి

**లక్కిరెడ్డిపల్లి :** మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలని లక్కిరెడ్డిపల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు సోమవారం వెలుగు కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలన్నారు.సంఘాలు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రి ప్రతి మహిళను లక్షాదికారిణి చెయ్యాలనే ధ్యేయంతో ఉన్నారన్నారు. ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు అమలు చేస్తున్నాయన్నారు. సమావేశంలో మహిళ మండల సమాఖ్య లీడర్లను పాతవారి స్థానంలో కొత్త వారిని ఎన్నుకున్నారు.

## 3న ఉచిత మెగావైద్య శిబిరం

**పెద్దమండ్యం :** మండలంలోని కలిచెర్ల రెవిన్యూ గ్రామ పరిధిలోని మౌలాక ఫహాడ్‌లో ఆస్థాన-ఎ-మ గుద్దములహి అమీన్ పిర్ దర్గా పెద్దదర్గా పీఠాధిపతి మౌలాక ఫహాడ్ వెల్ఫేర్ సొసైటీ హాజరత్ ఖాజా సయ్యద్‌షా, అరిపుల్లా మహమ్మద్ హుస్సేనీ చిష్టిపుల్ వారి ఆధ్వర్యంలో 3న గురువారం జరు ఉచిత మెగా వైద్య నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్‌రావు, ఎంపిపి పూర్ణచంద్రిక రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులు గురించి అనుభవం కలిగిన వైద్యులు వస్తున్నారని తెలిపారు. వైద్య శిబిరానికి ఎంపీ పెద్దిరెడ్డి మిదున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, కడప గురువుఅరిపుల్లా హుస్సేనీలు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి జనార్ధన్, ఆ-ఆష్షన్ ఖాదర్‌వల్లి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు,వైసిపి నాయకలు పాల్గొన్నారు.

## నేడు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాల పంపిణీ

**రాయచోటి :** కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం రాయచోటి నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా ట్రై సైకిళ్ళు, మోటార్ వాహనాలు, వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తామని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి పి.రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ, రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్ గిరీష పి.ఎస్, రాయచోటి శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు ఉచితంగా ట్రైసైకిళ్లు, మోటార్ వాహనాలు, వినికిడి యంత్రాలను అందజేస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎవరైనా వినికిడి సరిగా లేనివారు, వికలాంగులై పూర్తిగా నడవలేని వారు ఇంకను ఉంటే వారి ఆధార్, రేషన్ కార్డులు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, డాక్టర్ సర్టిఫికేట్, సంబంధిత ధ్రువీకరణ పత్రం తీసుకొని వస్తే వారికి కూడా ఉచితంగా వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్ ను పంపిణీ చేస్తామన్నారు.

## న్యాయవాది హత్యకు నిరసనగా ధర్నా

**రాయచోటి :** విజయవాడకు చెందిన న్యాయవాది విఠల్‌బాబు హత్యకు నిరసనగా భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో రాయచోటి కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించి ఉదయం 11:30 గంటల నుంచి 12 గంటల వరకు రాయచోటి కోర్టు గేటు ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య-కడప జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఖాదర్ బాషా మాట్లాడుతూ మన రాజ్యాంగాన్ని అనుసరించి చట్టప్రకారం నడుచుకోవాలని, రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలని కక్షిదారులు తరపున కోర్టుల్లో వాదిస్తున్న న్యాయవాదులను వ్యక్తిగతంగా చూస్తూ దాడులకు పాల్పడుతూ హత్యలు కూడా చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు.న్యాయవాదుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని వారి డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అజంతుల్లా, ధనుంజయ్‌కుమార్, చిన్నయ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రవిశంకర్, హుమయూన్‌బాషా, పాల్గొన్నారు.

మిట్స్‌లో పరిశోధనలపై చర్చిస్తున్న జపాన్ ప్రొఫెసర్లు

## ఉమ్మడి పరిశోధనలకు జపాన్ ప్రొఫెసర్ల కృషి

**ప్రజాశక్తి-కురబలకోట**

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జపాన్‌లోని చిబా యూనివర్శిటీ ఆఫ్ కామర్స్ నుంచి ప్రొఫెసర్ యుకారి షిరోటా, గకుషుయిన్ విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ టెట్సుజీ కుబోయామా, ప్రొఫెసర్ టకాకో హషిమోటోలు మూడురోజుల పాటు కళాశాలను సందర్శిస్తారని ప్రిన్సిపల్ యువరాజ్ పేర్కొన్నారు. వీరు కళాశాలలో గల స్కూల్ అఫ్ మేనేజిమెంట్, స్కూల్ అఫ్ కంప్యూటరింగ్ రంగాలైన ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ రంగాలలో ఉమ్మడి పరిశోదనలకు కృషిచేస్తారని తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్‌లలో విద్యార్థులను, అధ్యాపకులను ప్రోత్సహించడానికి ఇది ఒక మంచి అవకాశమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బసాబి చక్రబర్తి, కో- ఆర్డినేటర్ యు.విజయలక్ష్మి, బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న బత్యాల చెంగల్రాయుడు

## పదవ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ

**ప్రజాశక్తి-నందలూరు**

మండలంలోని అన్ని పాఠశాలలో రాయల్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గంగనపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం నందలూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్య క్రమం లో బత్యాల మాట్లాడుతూ ప్రజలకు రాయల్ సేవాసమితి ద్వారా ఎనలేని సేవలందిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఐఎఎస్, ఐపిఎస్, జడ్జిలుగా, లాయర్లుగా ఇంకా చాలా ఉన్నత స్థానాలను అధిరోహించారని, అదేవిధంగా నేటి విద్యార్థులు కూడా బాగా చదువుకొని వారిలాగా ఉన్న స్థాయికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నందలూరు గ్రామపెద్దలు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## బిసిలను కించపర్చిన వైసిపి నేతలకు బుద్ధిచెప్పాలి

**ప్రజాశక్తి-ములకలచెరువు**

బిసిల ఆత్మగౌరవాన్ని అవహేళనచేసి కించపరచిన వైసిపి నేతలకు తగిన గుణపాఠం చెప్పాలని టిడిపి రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ములకలచెరువులో టిడిపి బిసి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో భాగంగా ఒంగోలులో నిర్వహించిన జయహో బిసిసభకు హజరైన అధికార పార్టీ బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని, సమస్యలను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. వైసిపి నాయకులే బాధితులను ఉద్దేశించి పెయిడ్ ఆర్టిస్టులు అంటూ ఎంపి మోపిదేవి, వెంకటరమణ, సహా పలువురు వైసిపి నాయకులు అవమానించడం దురదృష్టకరం అన్నారు. బిసిలపై హత్యలు, దాడులు, బెదిరింపులు, కేసులు పెడుతూ నానా రకాలుగా ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న వైసిపి నాయకుల దుశ్చర్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ వడ్డెర సాధికార సంఘం అధ్యక్షుడు దేరంగుల నారాయణ, రాజంపేట పార్లమెంట్ బీసీసెల్ అధికార ప్రతినిధి ముత్తుకూరు మౌలా, పాల ఏకరి సుధాకర్‌యకుడు(జెసిబి), మాజీ వైస్‌ఎంపిపి నరసింహరెడ్డి, నాయకులు మహేష్, వెంకటస్వామి, రామాంజులు, పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

అరెస్టయిన నిందితులతో డిఎస్‌పి, పోలీసు సిబ్బంది

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

### - రూ.31 లక్షల విలువైన 21 బైక్‌లు స్వాధీనం

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

అంతర జిల్లాల ద్విచక్రవాహనాల దొంగల ముఠా గుట్టును బి.కొత్తకోట పోలీసులు రట్టు చేశారని డిఎస్‌పి కేశప్ప పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను విలేకరుల ఎదుట ప్రవేశ పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూరల్ సిఐ శివాంజనేయులు, ఎస్ఐ రామ్మోహన్ తమ సిబ్బందితో సోమవారం కాండ్లమడుగు క్రాస్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారని చెప్పారు. ఈ నేపథ్యంలో తిరుపతి, పాకాల, కల్లూరు, పుంగనూరు, గుర్రంకొండ, చిత్తూరు, తవణంపల్లి, పీలేరు, బి.కొత్తకోట తదితర ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడిన నిందితుల ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎ1 నిందితుడు గుర్రంకొండ మండలానికి చెందిన చెన్నూరి ప్రకాష్, ఎ2 నిందితుడు నెల్లూరు పట్టణంలోని నవాబుపేటకు చెందిన గణేశం సుబ్బారెడ్డి, ఎ3 నిందితుడు కలకడ మండలానికి చెందిన ఎం.అక్బర్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.31 లక్షల విలువైన 21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తిరుపతి నగరంలో కూలీ పనులు చేసుకుంటూ పరిచయమైన వీరు చెడు వ్యసనాలకు అలవాటు పడి నేర ప్రవృత్తిని ఎంచుకున్నారన్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాలను చాకచక్యంగా చోరీలు చేసే వారన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన బి.కొత్తకోట ఎస్.ఐ.రామ్మోహన్, సిబ్బందిని అభినందించి నగదు రివార్డును అందించారు.

## మరిదిని గాయపరిచిన వదిన అరెస్టు

**ప్రజాశక్తి-కలకడ**

భర్త సొంత తమ్ముని గాయపరిచిన వదినను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు.. మండలంలోని కోట గుడిబండ పంచాయతీ ఎల్లం గుడిబండ దళితవాడకు చెందిన నగిరి మడుగుశేఖర్ భార్య నగిరిమడుగు వీరనాగమ్మ తన భర్త తమ్ముడు నగిరిమడుగు సాంబశివను ఈ ఏడాది ఏప్రిల్ ఆరవ తేదీన మచ్చు కొడవలితో రెండు చేతులను నరికి, రక్త గాయాలు చేసిన విషయం తెలిసిందే.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితురాలు సోమవారం మండలంలోని కె.దొడ్డిపల్లి సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ శోభారాణి వెళ్లి వీరనాగమ్మను అరెస్టు చేసి చిత్తూరు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.